క్లుప్తంగా

కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి



జి.అగ్రహారంలో పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఇంద్రశేఖర్

అంబాజీపేట: మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అన్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపు మేరకు గంగలకుర్రు అగ్రహారంలో శేఖర్ స్వగృహంలో పరిశీలకులు, గ్రామ కమిటీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, పీకే రావు, ఎంఎం శెట్టి, కొర్లపాటి కోటబాబు, కాండ్రేగుల గోపాలకృష్ణ, ముత్తాబత్తుల ప్రశాంత్, రాయుడు మీరయ్య, బుడితి సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.

నల్లరిబ్బన్లతో ఉద్యోగుల నిరసన



మామిడికుదురులో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

మామిడికుదురు: మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మంగళవారం భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలని అభ్యర్థించారు. తమను మాతృ శాఖలకు అప్పగించాలని కోరారు. సమయ పాలన లేని, ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఏడేళ్ల ఒకే క్యాడర్లో పని చేసిన వారికి ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన



సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

రాజోలు: పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకంపై మంగళవారం మండలంలోని పొన్నమండ, తాటిపాక, రాజోలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. అమలాపురం విద్యుత్‌శాఖ ఈఈ కె.రాంబాబు మాట్లాడుతూ 3 కెడబ్ల్యూ సోలార్ విద్యుత్ పథకం ద్వారా రూ.78 వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు. రిజిస్టర్ సోలార్ వెండర్ ద్వారా యూనిట్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చన్నారు. సోలార్ విద్యుత్ ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చన్నారు. సోలార్ విద్యుత్ పథకం వాల్‌పోస్టర్లను అందజేశారు. రాజోలు సబ్ డివిజన్ డీఈఈ కృష్ణంరాజు, ఏఈ మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ కిట్ల పంపిణీ



దాతలు అందించిన కిట్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మలికిపురం: మండలంలోని బట్టేలంక అల్లూరి తిమ్మరాజు మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల కళాశాల విద్యార్థులకు దాతలు సమకూర్చిన సాఫ్ట్‌బాల్ కిట్లను అందించారు. దాతలు బట్టేలంకకు చెందిన పెనుమత్స సీతారామరాజు, సుభాష్‌రాజు, లక్కవరానికి చెందిన అల్లూరి దిలీప్‌రాజు, రుద్రరాజు రఘురాజు అందించిన రూ.40 వేలతో సాఫ్ట్‌బాల్ కిట్లను హెచ్ఎం హనుమంతరావు, పీఈటీలు వి.కుమార్, కె.సతీష్‌కుమార్‌లకు మంగళవారం అందించారు. దాతలను పాఠశాల ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

పి.గన్నవరం: మండలంలోని ముంగండ శివారు మామిశెట్టివారి పాలెంలో మంగళవారం పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.1150 స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వివరించారు.



అయినవిల్లిలో గాయత్రీదేవి అలంకరణలో..



తాటికాయలవారిపాలెంలో..



చింతలూరులో..



అంబాజీపేటలో..

జగన్మాతా నమోస్తుతే..

- గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం
- కిటకిటలాడిన ఆలయాలు
- పందిళ్లలో ప్రత్యేక పూజలు

కొత్తపేట: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం కనకదుర్గాదేవి ఆలయాలు, నవరాత్ర పందిళ్లలో అమ్మవారిని వివిధ అవతారాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అలాగే స్థానిక బొరుసువారి సావరం విజయకనకదుర్గాదేవిని గాయత్రీదేవిగా అలంకరించారు. బోడిపాలెం విజయకనకదుర్గాదేవి ఆలయం, ఏనుగులమహల్ గ్రామంలో రాజరాజేశ్వరీదేవి (శ్రీచక్రమహామేరు యంత్రం) ఆలయం, వాడపాలెం జ్ఞానసరస్వతీదేవి ఆలయం, పలు శివారు గ్రామాలు, మండలంలోని గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాలు, నవరాత్ర పందిళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: స్థానిక రామాలయం వీధిలోని సిద్ధివినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం కనకదుర్గమ్మ వారికి విశేష పూజలు చేశారు. అమ్మవారిని గాయత్రీదేవి అలంకరణలో ప్రత్యేకంగా అలంకరించారు.

బ్రహ్మచారిణిగా..

మామిడికుదురు: దసరా మహోత్సవాల్లో రెండో రోజు మామిడికుదురు విజయదుర్గమ్మ బాలాత్రిపుర సుందరిదేవిగా, పెదపట్నంలంక కనకదుర్గమ్మ బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాశర్లపూడిబాడవ ఆలయంలో ఆలయ ధర్మకర్త తోరం వెంకటరమణారావు ఆధ్వర్యంలో శత చండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష్మీ గణపతి అభిషేకాలు, మల్లేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో మహాలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పలు గ్రామాల్లో కనకదుర్గమ్మ ఆలయాల్లో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష కుంకుమ పూజలు జరిపారు. అలాగే అయినవిల్లిలో అన్నపూర్ణదేవిని, తొత్తరమూడిలోని రాజరాజేశ్వరీదేవిని, ముక్తేశ్వరం ముక్తికాంత అమ్మని, నేదునూరు సర్వమంగళపార్వతి అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: స్థానిక బస్‌స్టేషన్ వద్ద వేంచేసిన వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి మంగళవారం భక్తులకు గాయత్రీమాత అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కాసు శ్రీనివాసరావు, గోకవరపు శివల ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే స్థానిక పెద్ద వీధిలోని శ్యామలానగర్‌లో వేంచేసి ఉన్న వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామికి గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. మాచవరం శివారు కోఠి వారి అగ్రహారంలో వేంచేసిన భువనేశ్వరీ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఆలమూరులో..

ఆలమూరు: స్థానిక దుర్గాదేవి అమ్మవారు గాయత్రీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దేవీ మండపాల్లో నెలకొల్పిన అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు నిర్వహించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: గ్రామ శివారు తాటికాయల వారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారు మంగళవారం గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. దాతల సాయంతో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యం వహించారు. అలాగే స్థానిక అంబాజీపేట-గన్నవరం రోడ్డులో శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు.



బాలాత్రిపుర సుందరీదేవిగా కొత్తపేట వాసవీమాత



బ్రహ్మచారిణిగా పెదపట్నంలంక కనకదుర్గమ్మ

బూత్ కమిటీలతో వైఎస్సార్ సీపీ బలోపేతం

కొత్తపేట: గ్రామ స్థాయి నుంచి పార్టీ బూత్ కమిటీలు, బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం పూర్తి చేసి వచ్చే ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయాలని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గం నుంచి రాష్ట్ర వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల విభాగం సెక్రటరీగా చేట్ల రామారావు నియమితులయ్యారు. ఆయన మంగళవారం రావులపాలెం మండలం గోపాలపురంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డిని, మాజీ మంత్రి సూర్యారావును మర్యాదపూర్వకంగా కలిశారు. వారు రామారావును పూలమాల, శాలువాతో సత్కరించారు. అనంతరం బూత్ కమిటీలు, బూత్ లెవెల్ ఏజెంట్లు నియామకంపై జగ్గిరెడ్డి, సూర్యారావు, రాష్ట్ర బూత్ కమిటీల విభాగం ప్రధాన కార్యదర్శి, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, కార్యదర్శి రామారావు చర్చించారు. కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



గోపాలపురంలో రామారావును అభినందిస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి, మాజీ మంత్రి సూర్యారావు

ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్లు వేయవద్దు

అంబాజీపేట: నివాస ప్రాంతాల్లో ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్‌లు వేయవద్దని, తక్షణం నిలుపుదల చేయాలని గంగలకుర్రు సిద్ధార్థనగర్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సిద్ధార్థనగర్‌లో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకునకు విద్యుత్ సరఫరా అవసరం కావడంతో పంచాయతీ ద్వారా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు. ఆ ట్యాంకునకు విద్యుత్ సరఫరా అందించేందుకు మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు పనులు ప్రారంభించారు. 11 కేవీ విద్యుత్ లైన్లు భవనాలు అతిదగ్గర్లో నుంచి వెళ్లడంతో ప్రమాదాల బారిన పడుతామని భావించి స్థానికులు పనులను అడ్డుకున్నారు. దీంతో విద్యుత్ శాఖ సబ్‌ఇంజినీర్ మోహన్, సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సత్యవేణి ఆ ప్రాంతానికి చేరుకుని స్థానికులతో చర్చించారు. నివాస ప్రాంతాల నుంచి విద్యుత్ లైన్లు వేస్తే ఊరుకునేది లేదని అధికారులపై మండిపడ్డారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై కె.చిరంజీవి తన సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకుని విషయాన్ని అధికారులు, స్థానికులతో చర్చించారు. విద్యుత్ లైన్ల వల్ల ఇబ్బందులు పడతామని, ఖాళీ స్థలాల నుంచి లైన్లు వేయాలని సూచించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని సబ్ ఇంజినీర్ మోహన్ తెలపడంతో విషయం సద్దుమణిగింది.

మహిళల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



వీరవల్లిపాలెంలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



మడికిలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

అంబాజీపేట: మహిళల ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. వక్కలంకలో స్వాస్థ్ నారీ-సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా సర్పంచ్ వాసంశెట్టి రేవతి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎంపీపీ వెంకటేశ్వరరావు, వైద్యాధికారి కె.సుమప్రియ మాట్లాడుతూ గర్భిణులు ఆహారంలో పోషకాలు కలిగిన చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. మహిళల ఆరోగ్యం ఇంటికి బలాన్ని ఇస్తుందన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసంశెట్టి పెదబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: ఇల్లు ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆనందం, ఐశ్వర్యంతో తులతూగుతుందని వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యులు లక్ష్మీసౌజన్య, విజయ్ అన్నారు. వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వద్ద స్వస్థ్ నారీ-సశక్తి పరివార్ అభియాన్ నిర్వహించారు. వైద్యులు గర్భిణులను పరీక్షించి వైద్యసేవలు అందించారు. సర్పంచ్ సలాది బుచ్చిరాజు ఆధ్వర్యంలో మోదీ పుట్టినరోజు, గర్భిణులకు సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: స్వాస్థ్ నారీ-సశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా మండలంలోని మడికి-3, పెనికేరు-1 గ్రామ సచివాలయాల్లో మంగళవారం గర్భిణులకు సీమంతాలు జరిగాయి. చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహలత, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు అధ్యక్షత వహించగా ఏఎంసీ చైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైద్యాధికారులు కె.భాగ్యశ్రీ, బి.అనంతరామకృష్ణ, సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపిహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈఓలు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జేజేఎం వాటర్ ప్లాంట్స్ నిర్మాణ స్థలాల పరిశీలన

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వసంతవాడ గ్రామ పంచాయతీ పరిధిలో జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) కింద వాటర్ ప్లాంట్స్ నిర్మాణానికి సంబంధించి అధికారులు గుర్తించిన స్థలాలను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోస్తా తీరం వెంబడి సెంట్రల్ డెల్టా ప్రాంతంలో గ్రామాల తాగునీటి అవసరాలు తీర్చుటకు జేజేఎం ద్వారా రూ.1,650 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదించారు. వాటర్ హెడ్ వర్క్స్ శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి వసంతవాడలోని రెండు ప్రాంతాల్లో 19 ఎకరాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆ ప్రదేశాలను కలెక్టర్ మహేష్‌కుమార్ రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి ప్రాథమికంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ పి.శ్రీకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్‌వీ కృష్ణారెడ్డి, డీఈలు రవికుమార్, పద్మనాభం, తహసీల్దార్ రాజేశ్వరరావు, మెగా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



వసంతవాడలో వాటర్ ప్రాజెక్టు నిర్మాణ స్థలాలు పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఆలమూరు: విద్యార్థి నుంచే ప్రతి ఒక్కరూ న్యాయపరమైన అంశాలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై జి.నరేష్ అన్నారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.సురేష్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన విద్యార్థులకు ప్రేరణాత్మక అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ ఆదేశాల్లో భాగంగా డ్రగ్స్ వద్దు బ్రో, సైబర్ నేరాలు, మహిళల భద్రత, ట్రాఫిక్ నియమాల గురించి వారు వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసే మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించి హెల్మెట్ ధరించడం ద్వారా అనేక రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని సీఐ విద్యాసాగర్, ఎస్సై నరేష్ పేర్కొన్నారు.



ఆలమూరులో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఐ విద్యాసాగర్

అధ్వానంగా ధనమ్మపేట రోడ్డు



గోతులతో అధ్వానంగా ఉన్న ధనమ్మపేట రోడ్డు

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలోని ధనమ్మపేట రోడ్డు అధ్వానంగా మారింది. ధనమ్మపేట నుంచి ఆదుర్రు వెళ్లే పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఈ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆ గోతుల్లో వర్షం నీరు నిలిచిపోయి స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా కాలం నుంచి ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ దీన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రోడ్డు అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణం శ్రద్ధ చూపి దీన్ని ఆధునీకరించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై తక్షణం స్పందించాలని కోరుతున్నారు.

పట్టుదలతోనే విజయం సాధ్యం



విజేతలను సన్మానించిన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

మలికిపురం: పట్టు వదలకుండా దీక్షతో సన్నద్ధమైతే ఏ ఉద్యోగ నియామక పరీక్షల్లో అయినా సరే అలవోకగా విజయాలు సాధ్యమవుతాయని మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ ఆర్‌వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ మంగెన సత్యనారాయణమూర్తి అన్నారు. కళాశాలలో చదివి ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు, పోలీసు ఉద్యోగాలు, పంచాయతీ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ×కళాశాల పూర్వ విద్యార్థుల అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో నిత్య కృషితో ఉద్యోగాలు సాధించడం గర్వకారణం అన్నారు. ఉద్యోగాల సాధన వెనుక ఎన్నో అద్భుతమైన క్షణాలు ఉంటాయని కొనియాడారు. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన బి.నాగేంద్రబాబు, వైజీడీ నాగబాబు, వై.రవిప్రసాద్, వై.దుర్గాప్రసాద్, ఎల్.భ్రమరాంబ, వి.శ్రీలక్ష్మి, ఎ.దుర్గాదేవి, జి.నవ్యశ్రీ, (కానిస్టేబుల్), బి.దుర్గాదేవి, పి.సాయిలక్ష్మి, ఎ.పుష్పలత, ఎ.గంగరాజు (పంచాయతీ కార్యదర్శి)లను శాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలు, స్వీట్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గెద్దం రాజ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఆనంద మహని, సీనియర్ అధ్యాపకులు ఎస్.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు సామూహిక సత్యసాయి వ్రతాలు

అంబాజీపేట: భగవాన్ సత్యసాయిబాబా వారి అవతార శతాబ్ది జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈనెల 25న అంబాజీపేట కొర్లపాటివారిపాలెం సత్యసాయి సేవా కేంద్రంలో ఉదయం 9 గంటలకు సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 100 మందికి వస్త్రదానం, 9 మంది గర్భిణులకు సీమంతాలు చేయనున్నామన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామదేవత శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపాన మంగళవారం ఇసుక లారీ కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో కరెంటు స్తంభం విరిగి పోయింది. హెచ్‌టీ లైన్‌కు చెందిన తీగలు తెగిపోయాయి. కరెంటు తీగలు రోడ్డుపై తెగిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నివాస గృహాల మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ఉదయం కావడంతో పిల్లలు ఎవరూ అక్కడ లేరని స్థానికులు తెలిపారు. లారీ నుంచి డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. అనంతరం సంబంధిత అధికారులు విరిగిపోయిన స్తంభం స్థానే కొత్త స్తంభం ఏర్పాటు చేశారు.

నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

మలికిపురం: మండలంలోని పడమటిపాలెం పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం కందికట్ల రత్నకుమారిపై జరిగిన దాడి సంఘటనపై ఐదుగురు సభ్యుల మానవ హక్కుల వేదిక బృందం గ్రామంలో మంగళవారం నిజ నిర్ధారణ చేపట్టింది. పదిహేడేళ్ల సర్వీసున్న ఏఎన్ఎం విధి నిర్వహణలో భాగంగానే చంటి బిడ్డకి వయసుకి తగినట్లుగా వేయాల్సిన వ్యాక్సిన్లు వేశారని పేర్కొన్నారు. అయితే దానిలో ఒక వ్యాక్సిన్ తాము ముందే వేయించుకున్నామని, ఇప్పుడు మళ్లీ ఎందుకు వేశారని వాగ్వివాదానికి దిగి గొడవ పెట్టుకున్నారు. ఏఎన్ఎంపై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని వారు నినదించారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా అధ్యక్షుడు ఎం.ఇక్బాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల శ్రీనివాసరావు, పెయ్యల సత్యనారాయణ పాల్గొన్నారు.

కొమరాడలో ఘనంగా ఉరుసు



ఉత్సవంలో భాగంగా గంధం ఊరేగింపు

మామిడికుదురు: కొమరాడలో సయ్యద్ మహమద్ ఖాదర్ షరీఫ్ ఖాదరి ఉర్ఫ్ హాజీ మస్తాన్ బాబా ×కంబల్ పోష్ే ప్రార్థనా స్థలం వద్ద హజరత్ మహబూబ్ సుబహానీ, కరీముల్లాషా ఖాదరి వార్ల ఉరుసు మంగళవారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా మగటపల్లిలోని జనాబ్ షేక్ గౌస్ స్వగృహం నుంచి ఫకీర్ల సమ్మేళనంతో గంధం ఊరేగించారు. కొమరాడ డ్యామ్ సెంటర్ వరకు ఈ ఊరేగింపు జరిగింది. ప్రార్థనా స్థలం ట్రస్టీ ఎండీవై షరీఫ్ ఆధ్వర్యంలో మగ్‌రిబ్ నమాజ్ అనంతరం శాంతి, శుభం, సౌభ్రాతృత్వం కోరుతూ (ఫాతెహా) ప్రార్థనలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

శాయ్ క్రీడాకారులకు పతకాలు



పతకాలు సాధించిన శాయ్ క్రీడాకారులు

యానాం: కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలోని స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) అకాడమీ యానాం శాఖ క్రీడాకారులు ఇటీవల నిర్వహించిన 9వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ మోడరన్ పెంథాలన్ బైథిల్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో పతకాలు సాధించారని మంగళవారం ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అండర్ -17లో కోలాటి సతీష్‌కుమార్, అండర్-15లో వి.వెంకటనాగసాయి, పి.నిషాంత్, పి.నమ్రత బంగారు పతకాలు, కె.వీరబాబు రజత పతకం సాధించారు. అండర్-13లో జీఎల్ఎస్ హర్ష, ఎమ్ వల్లీకాశ్రీజ బంగారు పతకాలు, ఎన్ అభిషిక్త్ రజత పతకం సాధించారు, అండర్-11లో వి.ప్రజ్ఞ బంగారు, ఎస్ హేమ వర్షిణి రజత పతకం సాధించారు. అండర్-9లో ఎస్.మృద్వీకవర్షిణి బంగారు పతకం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ రవితేజ గ్రంధి పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో అధిక చార్జీలపై కఠిన చర్యలు

అమలాపురం రూరల్: దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల బలహీనతను ఆసరాగా తీసుకుని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ సందర్భంగా మంగళవారం డీటీఓ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 388 ప్రైవేట్ బస్సులను తనిఖీ చేసి రూ.33,33,550 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశామని ప్రతివారం ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు, రహదారి భద్రతా ఉల్లంఘనలను ఉపేక్షించేది లేదని డీటీఓ తెలిపారు. బస్సులను మితిమీరిన వేగంతో నడుపవద్దని, డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.